క్లుప్తంగా

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ట్రెనింగ్ పార్టనర్‌గా పని చేస్తోంటాడు. శుక్రవారం రాత్రి 7.40 గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి బైక్‌పై పాముల కాల్వ వైపు వస్తుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాసరావు మోకాలికి గాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'పోలవరం' నిర్వాసితులకు న్యాయం చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్రకు మద్దతుగా దళిత, గిరిజన, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. నిర్వాసితులకు పునరావాసం చట్టం, 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు బి.కిరణ్ నాగమణి, జి.రామారావు, పిచ్చుక శ్రీనివాస్, కరవది సుబ్బారావు పాల్గొన్నారు.

శాకంబరీదేవికి నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శాకంబరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు పలువురు నృత్య నీరాజనాలను అర్పించారు. ఇంద్రకీలాద్రిపై రాజగోపురం ఎదుట కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ నృత్య మందిర్‌కు చెందిన పలువురు కళాకారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

హెచ్ఎంపై చర్యలకు డీఈవో సిఫార్సు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాచవరంలోని టీఎంఆర్సీ నగరపాలకసంస్థ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక విద్యాశాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. వివరాల్లోకి వెళితే మాచవరం టీఎంఆర్సీ నగరపాలకసంస్థ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న కుమార్ రెడ్డి జూన్ 30వ తేదీన 14 మంది విద్యార్థులను ఒంటిపై వాతలు వచ్చేటట్లుగా దండించారు. దానిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దానిపై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక విచారణ చేయాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్‌ను ఆదేశించారు. ఆయన శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, అలాగే విద్యాకమిటీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను సేకరించారు. విద్యార్థులను ప్లాస్టిక్ పైప్‌తో అకారణంగా కొట్టడంతో పాటు విద్యార్థినులను రాళ్లపై మోకాళ్లపై కూర్చోపెడుతున్నారని వివరించారు. వాటి వివరాలను కేవీఎస్‌కుమార్ సీవీ రేణుక దృష్టికి తీసుకెళ్లగా ప్రధానోపాధ్యాయునిపై చర్యలకు ఉన్నతాధికారులకు ఆమె లేఖ రాశారు.

మైనార్టీ నేతల ఆత్మీయ సమావేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరానికి చెందిన పలువురు మైనార్టీ నేతల ఆత్మీయ సమావేశం శనివారం లబ్బీపేటలోని అల్ మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసీఫ్, నగరపాలకసంస్థ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండీ ఆబిద్ లతో పాటు, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్, నూరుద్దీన్, పలు ముస్లిం సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిఫాం సివిల్ కోడ్‌తో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ విషయంలో సంఘటితంగా నిర్ణయాన్ని వెల్లడించాలని, లా కమిషన్‌కు అందరి అభిప్రాయాలను తెలియజేయడంపై చర్చించారు.





వైభవంగా శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలి రోజు అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.





దుర్గమ్మకు సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శనివారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. కామకోటినగర్ నుంచి పాదయాత్రగా మహా మండపానికి చేరుకున్న వాణి, అరుణ, అన్నపూర్ణ తదితర భక్త బృందానికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పామర్రుకు చెందిన భవానీ భక్త బృందం, విజయవాడ మారుతి లలితా మండలి భక్తులు, రత్న కుమారి బృందం, ఇతర బృందాలకు చెందిన 900 మంది భక్తులు మహా మండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తికి సారెను సమర్పించాయి. సారె సమర్పించిన భక్త బృందాలకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు.

అర్హులకు పథకాలు అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం



లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, పుణ్యశీల తదితరులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 34, 35వ డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలను ఆ పార్టీ కార్యకర్తలకే అందించేవారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దకు వెళ్లి పథకాలను అందించటం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఇప్పటికే 99 శాతం మందికి పథకాలను అందిస్తున్నామని చెప్పారు. సాంకేతికపరమైన ఇబ్బందులతో పథకాలు అందని వారికి నేరుగా అప్పటికప్పుడు పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నెల రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

పవన్ రాజకీయాలకు పనికిరాడు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ పగటి కలలు కనటం మానుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవలేని పవన్‌కళ్యాణ్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో వైఎస్సార్ సీపీని ఒక్క సీటును కూడా గెలవనీయనని తొడలు కొట్టి చెప్తున్నా పవన్ ముందు తాను గెలుస్తాడో లేదో చూసుకోవాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో పవన్‌ను చిత్తుగా ఓడించి అసెంబ్లీ గేటు తాకకుండా చేసిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబునాయుడు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ సినిమా డైలాగులు చెప్తున్నాడని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ సినిమాలకు తప్ప రాజకీయాలకు పనికి రాడన్నారు. అనంతరం అర్హులైన 700 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, 34వ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల, 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణిమ్మ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, బూదాల శ్రీను, మాబూ, చెన్న ప్రసాద్, సంగీత్‌బాబు, రాజ్‌కుమార్, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులు, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి



సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమైన కార్పొరేటర్ విజయ్‌కుమార్

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): 49వ డివిజన్‌లో ఈ నెల 17వ తేదీన జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం 49వ డివిజన్‌లోని సచివాలయంలో ఆయన సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు, వీఆర్వోలు, వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరుస్తూ డివిజన్‌లోని 166, 167, 168, 169 సచివాలయాల పరిధిలో ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని పేర్కొన్నారు. ఇతర ఏ కారణం చేతనైన అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారిపై సచివాలయ ఉద్యోగులు శ్రద్ధ వహించి వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. వీఆర్వో అరుణ, సచివాలయం అడ్మిన్లు, సెక్రటరీస్, వలంటీర్లు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ వెంటే మైనార్టీలు



మైనార్టీ సంక్షేమ కరపత్రాలతో గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ గోదావరి గంగ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని ముస్లిం మైనార్టీలు ముక్తకంఠంతో నినదిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమంలో భాగంగా శనివారం 47వ డివిజన్ పరిధిలోని ఐజాక్ వీధిలోగల మజీదే హుస్సేని వద్ద ఆయన స్థానిక ముస్లిం పెద్దలు, మస్జిద్ బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్, మౌజాన్ల పారితోషకం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు జరుగుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు జరగటం లేదని అన్నారు. సీఎం జగన్‌కు, మైనార్టీల పక్షపాతి అయిన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు మైనార్టీలంతా అండగా నిలబడి వచ్చే ఎన్నికల్లో వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మైనార్టీ సంక్షేమ కరపత్రాలను సమావేశంలో పాల్గొన్న ముస్లిం మైనార్టీలకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గోదావరి గంగ, డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ, నాయకులు గోదావరి బాబు, షేక్ బాజీ షహీద్, షేక్ బడేమియా, ఎండీ ఇక్బాల్, షేక్ యాసిన్, మస్జిద్ ప్రెసిడెంట్ ఎండీ రఫీ, సెక్రటరీ ఎండీ యూనిస్, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణిమ వేడుకలు



హెచ్‌బీకాలనీలో విశేష అలంకారంలో బాబా

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక సాయినాథుని ఆలయాల్లో నిర్వహిస్తున్న వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక పాత హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణిమ ద్వాదశ సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు శనివారం ఉదయం 6 గంటలకు బాబా విగ్రహాన్ని నారికేళ జలంతో అభిషేకించారు. అనంతరం తులసి దళాలతో సహస్రనామార్చన గావించారు. మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి వెంకట కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు పర్యవేక్షించారు. భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామి మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణిమ మహోత్సవంలో భాగంగా శనివారం సాయిబాబాకు క్షీరాభిషేకం చేశారు. మందిర ధర్మకర్త పాములపాటి దుర్గాప్రసాద్–మధుబాల, పలువురు భక్తులు పాల్గొన్నారు.

108 వాహనంలో సుఖ ప్రసవం



డెలివరీ చేసిన సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): పురిటినొప్పులతో ఉన్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే సుఖ ప్రసవం చేసిన ఘటన శనివారం విజయవాడలో జరిగింది. వివరాల ప్రకారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన గర్భిణి శంఖం మహిమ శనివారం ఉదయం 7.45 గంటలకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. కాల్ అందుకున్న కంట్రోల్ రూమ్(పాతప్రభుత్వాస్పత్రి ఆవరణలోని) వెహికల్ ఆమె ఇంటికి వెళ్లింది. అప్పటికే నొప్పులు ఎక్కువగా రావడంతో వెహికల్‌లో పాత ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ప్రసవం జరిగింది. 108 వాహనంలోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వినయ్‌కుమార్‌తో పాటు, గర్భిణి వెంట ఉన్న సహాయకులతో కలిసి వాహనంలోనే ప్రసవం చేశారు. అనంతరం మహిమ రక్తహీనతతో ఉండటంతో పాత ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో మహిళ భర్త కోటయ్య 108 సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

తిరుమల నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయలు

లబ్బీపేట(విజయవాడతూర్పు) అయ్యప్పనగర్‌కు చెందిన గొట్టిముక్కల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలను శనివారం తిరుమల నిత్యాన్నదాన పథకానికి పంపించారు. కూరగాయలతో కూడిన లారీకి పూజలు నిర్వహించిన నాగేశ్వరరావు, అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సహకారంతో తిరుమలకు కూరగాయలు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో ధనేకుల వెంకట సత్యనారాయణ, మండవ శ్రీనివాస్, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న రంగరాజన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కె.రంగరాజన్ అన్నారు. సూర్యారావుపేటలోని స్టేట్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో శనివారం బ్యాంక్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ డే సందర్భంగా ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. గుండె, కంటి, మహిళా ఉద్యోగులకు గైనకాలజీ విభాగంలో వైద్య పరీక్షలు, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపులో 200 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రపంచంలోని మొదటి 50 బ్యాంకుల్లో అగ్రగామిగా ఉందని, ఇటీవల ప్రకటించిన లాభాల్లో రూ. 50 వేల కోట్లు లాభార్జన గడించి మిగిలిన అన్ని బ్యాంకుల కంటే ముందుందని తెలిపారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌లో ఓటీపీలు చెప్పడం గానీ, ఏటీఎం పిన్ నెంబర్లు చెప్పడం గాని చేయవద్దని సూచించారు. బ్యాంక్ 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో శ్రీలీల సందడి



సిల్వర్ షోరూమ్‌లో హీరోయిన్ శ్రీలీల

పెళ్లి సందడి, ధమాకా, ఉస్తాద్‌భగత్‌సింగ్ వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన శ్రీలీల శనివారం నగరంలో సందడి చేశారు. వినూత్న నటనతో ప్రేక్షకుల మనసు దోచుకున్న ఈమె నగరంలో తళుక్కుమంది. ప్రముఖ సిల్వర్ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభించేందుకు ఆమె నగరానికి విచ్చేసింది. దీంతో పెద్ద ఎత్తున అభిమానులు ఆమెను చూసేందుకు తరలివచ్చారు. దీంతో ఎంజీ రోడ్డులో షోరూమ్‌వద్ద కోలాహలం నెలకొంది. సిల్వర్ ఆభరణాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన గోయాజ్ సిల్వర్ సంస్థ తన మూడో షోరూమ్‌ను విజయవాడలోని ఎంజీ రోడ్డులో ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను ప్రారంభించిన శ్రీలీల అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ డిజైన్స్ చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ వెండి ఆభరణాలు ఆకట్టుకుంటాయన్నారు. సినీ విశేషాలను పంచుకున్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



విజయవాడ రైల్వే హాస్పటల్ వేడుకల్లో వైద్య బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యరంగంలో ఎన్నో డిగ్రీలు చేసి, రోగులకు విశేష సేవలు అందించిన డాక్టర్ బీసీ రాయ్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలకు గాను డాక్టర్ బీసీ రాయ్ పుట్టిన, మరణించిన రోజైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైద్య విద్యార్థులు, వైద్యుల ఆధ్వర్యంలో శనివారం డాక్టర్స్‌డే వేడుకలు నిర్వహించారు. వైద్య కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీసీరాయ్ విగ్రహానికి డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, కోల్‌కత్తా మేయర్‌గా, వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన చేసిన సేవలకు భారతరత్న అవార్డును పొందారన్నారు. పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, రైల్వే మెడికల్ ఆఫీసర్స్ సంఘం విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రైల్వే ఆస్పత్రిలోని ఓపీడీ భవన్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల డివిజన్‌లోని వైద్య బృందం, ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్ వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలు కోల్పోయిన వైద్యులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆర్థో సర్జన్ డాక్టర్ మురళి డాక్టర్ చరిత్ర, డాక్టర్ బి.సి.రాయ్ గ్రంథంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైద్యులు, ఏసీఎంఎస్‌లు జైదీప్, రవికాంత్, సత్యనారాయణ, సీతారామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రంగా జయంతి వేడుకలపై విస్తృత ప్రచారం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆకులశ్రీనివాస్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాజీ శాసనసభ్యుడు, కాపు నేత దివంగత వంగవీటి మోహనరంగారావు 76వ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆయన శనివారం క్రైస్తవ, ముస్లిం మత పెద్దలను కలిసి ఆహ్వాన పత్రికలను అందచేశారు. భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గాలో బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ముజావర్ల కమిటీ అధ్యక్షుడు ముస్తాక్, సభ్యులను కలిసి రంగా జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను అందచేశారు. అలాగే గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో దైవ సేవకులు పాస్టర్ థామస్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆకుల శ్రీనివాస్‌కుమార్ పాల్గొని క్రైస్తవ మత పెద్దలను కలుసుకుని రంగా జయంతి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందచేశారు. నాయకులు పొదిలి చంటిబాబు, అల్లం పూర్ణచంద్రరావు, రెడ్డిపల్లి సురేష్, మేశం చిన్నా, జక్కా మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా గంగానమ్మ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించారు. పాలప్రాజెక్టు ఫంక్షన్ హాల్ సమీపంలోని శ్రీ గంగానమ్మ వారి ఆలయంలో, శ్రీ దుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాకంబరీదేవి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించి, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని భక్తులు శాకంబరీదేవిగా దర్శించుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉపాలయాల్లో దేవతా మూర్తులను ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించారు. కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.